

శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మాలతి

# అధిక సాంద్రతతో పత్తి సాగు లాభం

- తక్కువ సారవంతమైన నేలలు అనుకూలం
- కేవీకే మల్యాల శాస్త్రవేత్త మాలతి

తొర్రూరు, అక్టోబర్ 20 : అధిక సాంద్రతతో పత్తి సాగు లాభమని కేవీకే మల్యాల శాస్త్రవేత్త డాక్టర్ మాలతి అన్నారు. మండలంలోని పోలెపల్లి గ్రామంలో శుక్రవారం అధిక సాంద్రతతో పత్తి సాగుపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ విధానంలో ప్రతి సాలుకు మధ్య రెండున్నర అడుగుల దూరంలో మొక్క ముప్పావు లేదా ఫీట్ దూరంతో ఉండేలా విత్తనాలను వేసుకోవాలన్నారు. సాధారణ పద్ధతిలో ఎకరానికి 8 నుంచి 10వేల మొక్కలు వేస్తే అధిక సాంద్రత పద్ధతిలో 16 నుంచి 20వేల మొక్కలను వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొక్కలు ఎక్కువగా పెరుగకుండా పత్తికి 45 రోజులు, 65 రోజులకు ఒకసారి మెపిక్వాట్ క్లోరైడ్ మందును పిచికారీ చేయాలన్నారు. పంట 85వ రోజు దశలో తల కొసలు తుంచడం ద్వారా మొక్క ఎత్తు పెరగకుండా ఆ బలాన్ని పూత పిందే గ్రహించి ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. ఎర్రనేలలు, తక్కువ సారవంత మైన నేలలు ఈ రకమైన పద్ధతిలో పత్తి సాగుకు అనుకూలమని తెలిపారు. ఈ విధానంలో తక్కువ కాలపరిమితి కలిగిన విత్తనాలను ఎంచుకోవాలని, ప్రస్తుతం మార్కెట్‌లో నూజివీడు వారి నవనీత్, అర్మిత, సిరి వంటి విత్తన రకాలు లభిస్తున్నాయని తెలిపారు. 140 నుంచి 150 రోజుల్లో పంట కాల పరిమితి ముగుస్తుందని తెలిపారు. రెండు దశల్లోనే పత్తి ఉత్పత్తి ముగుస్తుందని, సాధారణ పద్ధతి కంటే 30 నుంచి 50శాతం పంట అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. మిర్చిలో తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మరో శాస్త్రవేత్త క్రాంతి వివరించారు. ఏవో కుమార్‌యాదవ్ ఆయిల్‌పామ్ సాగుతో లాభాలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త కిశోర్, ఏఈవో భరత్‌చంద్ర, రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 20 : నియోజకవర్గ కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను జనగామ డీసీపీ పీ సీతారాం శుక్రవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. తహసీల్దార్ డీ వెంకటేశ్వర్లు, సీఐ రాజు, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వాసం రామ్మూర్తి శుక్రవారం పరిశీలించారు. హిమ్మత్‌నగర్, రేగడితండా, తిమ్మంపేట. తమ్మడపల్లి(ఐ), ఉప్పుగల్లు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆంజనేయులుతో కలిసి ఆయన పరిశీలించారు.

## 'పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోవాలి'

రఘునాథపల్లి, అక్టోబర్ 20 : గర్భిణులు, బాలింతలు పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మధుకర్‌యాదవ్ సూచించారు. మండలంలోని కోమాల్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రమీల, కల్పన, ఉమాదేవి, కోమల, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గార్ల, అక్టోబర్ 20 : మండల కేంద్రంలో నేడు (శనివారం) బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. రాష్ట్ర గిరిజన స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు, ఇల్లందు నియోజకవర్గం ఇన్‌చార్జి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్, జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు సకాలంలో హాజరు కావాలని కోరారు.



## వాసవీమాత అలంకరణలో అమ్మవారు

తొర్రూరు, అక్టోబర్ 20 : డివిజన్ కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆరో రోజు స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కరెన్సీతో అలంకరించారు. అన్నారం రోడ్డులో భద్రకాళి మందిరం వద్ద చండీహోమం నిర్వహించి సామూహిక కుంకుమార్చన చేశారు. పూజలో పూజారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# అల్లరి
ALLARI

## చెప్పుకోండి



1. 'పిల్లలమర్రి' ఏ జిల్లాలో ఉన్నది?
2. భగీరథి, అలకనంద నదులు ఎక్కడ కలుస్తాయి?
3. స్వతంత్ర భారత తొలి ఉపరాష్ట్రపతి ఎవరు?

## పదసృష్టి



కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

**Little**

Ex : Tile

## చిట్టి స్కెచ్





**ఆర్. మానస**
రాయిలాపూర్

## కథ

# గంగిగోవు పాలు..



పూర్వం ఒక ఊళ్లో రాముడు, కృష్ణుడు అనే అన్నదమ్ములు ఉండేవారు. రాముడు ఎప్పుడు చూసినా లొడలొడా మాట్లాడుతూనే ఉంటాడు. కబుర్లు ఆపడం అనేదే ఉండదు. కృష్ణుడు అలా కాదు.. తక్కువ మాట్లాడుతాడు. కానీ, ఆ మాటల్లో ఎంతో ప్రేమ ఉంటుంది. మాటలు తగ్గించమని ఎంత చెప్పినా.. రాముడు వినేవాడు కాదు. రోజూ తెలివికి సంబంధించి ఏదో ఒక ప్రశ్న అడిగి.. ఆ ఇద్దరితో సమాధానం చెప్పించేవాడు వాళ్ల తాతయ్య. ప్రతిరోజూ కృష్ణుడే సరైన సమాధానం చెప్పేవాడు. దాంతో రాముడు చిన్నబుచ్చుకునే వాడు. అప్పుడు తాతయ్య.. ''ఒరేయ్! రాముడూ! మాట్లాడే వాళ్లు తక్కువ వింటారు. ఎక్కువ వినే వాళ్లకే ఎక్కువ జ్ఞానం వస్తుంది. ఆ విషయం నీకు ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు. కృష్ణుడు అది పాటిస్తున్నాడు కాబట్టే.. వాడి తెలివితేటలు ఎక్కువ ఉన్నాయి'' అన్నాడు. మరింత వివరంగా చెప్పమన్నట్లు తాత వైపు చూశాడు రాముడు. ''ఏం లేదురా! ఒక ఊరిలో ఒక ధనవంతుడు, ఒక బీదవాడు ఉన్నారు. ధనవంతుడు ప్రతిరోజూ బోలెడు మందికి అన్నం పెట్టేవాడు. బీదవాడు మాత్రం రోజూ ఒక్కరికే భోజనం పెట్టేవాడు. అలా.. ఇద్దరూ అన్నదానం చేసినా, బీదవానికే మంచిపేరు వచ్చింది. ధనవంతుడి గురించి అసలు ఎవరూ చెప్పుకోలేదు. ఎందుకంటే.. ధనవంతుడు తనకు బాగా డబ్బులు ఉన్నాయని.. పక్కనున్న హోటల్ నుంచి భోజనాలు తెప్పించేవాడు. ఇంట్లో పనివాళ్లతో వడ్డింపులు చేయించేవాడు. అదే బీదవాడు .. తానే స్వయంగా వంట చేసేవాడు. ఒక్కరికే అయినా.. 'ఇది కావాలా? అది కావాలా?' అని అడుగుతూ, కొసరి కొసరి వడ్డించేవాడు. అతిథి భోజనం చేస్తున్నంత సేపూ పక్కనే కూర్చునేవాడు. చక్కటి కబుర్లు చెప్పేవాడు. ఆ ఆప్యాయతకే అతిథికి సగం కడుపు నిండిపోయేది. చేతులు కాళ్లూ కడుక్కున్నాక.. అతణ్ని గుమ్మం దాకా సాగనంపి మరీ వచ్చేవాడు. ఇందులో రహస్యం నీకు అర్థమయ్యిందా? మనసు పెట్టి చేసిన వంట, పెట్టిన భోజనం అవతలివారికి ఎంతో సంతృప్తిని ఇస్తాయి. అంతేకానీ, వేలాది రూపాయలు ఖర్చుపెట్టి, వేలం వెర్రిగా విందు పెట్టామంటే కాదు. వచ్చిన వారిని పలకరించాలి కదా! అదే లేనప్పుడు ఇలా జరుగుతుంది. అందుకే.. 'గంగిగోవు పాలు గరిటెడైనా చాలు' అంటారు!'' అంటూ కథను ముగించాడు తాతయ్య. ఆ కథ విన్న తర్వాత రాముడిలోనూ మార్పు వచ్చింది. ఎక్కువ వినడం, తక్కువ మాట్లాడటం అలవాటు చేసుకున్నాడు.

**- యలమర్తి అనురాధ**

## పెద్దల మాట



అసూయపడే వారితో మన అభివృద్ధి గురించి, ఆవేశపడే వారితో మన ఆలోచనల గురించి చెప్పుకోవడం.. మూర్ఖత్వం!

**- గౌతమ బుద్ధుడు**

## తేడాలు కనిపెట్టండి





**ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 5 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.**

## ఆ పదమేంటి?

**ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.**



| S | | | | | | |
|---|---|---|---|---|---|---|

E E W A T R

## టంగ్ ట్విస్టర్స్

I scream you scream, we all scream for ice cream

జవాబులు : చెప్పుకోండి : 1. మహబూబ్‌నగర్, 2. దేవప్రయాగ్, 3. సర్వేపల్లి రాధాకృష్ణన్; ఆ పదమేంటి? : SWETTER

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా :
zindagi@ntnews.com